సోమవారం 24 నవంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



జెవివి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-నెల్లూరు : డిసెంబరు 21వ తేది నుంచి మూడు రోజుల పాటు కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో పాల్గొనేందుకు కెఎన్ఆర్ మున్సిపల్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. ఆదివారం నగరంలోని సీ.బీ.యస్.సీ శ్రీచైతన్య స్కూల్లో జరిగిన జనవిజ్ఞానవేదిక జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ చెకుముకి టాలెంట్ టెస్ట్ లో విజేతలైన విద్యార్థులు డిసెంబర్‌లో కాకినాడ లో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకి అర్హత సాధించారు. ఈ పోటీలకు ప్రభుత్వ విభాగంలో నెల్లూరు నగరం భక్తవత్సల నగర్ లోని కెఎన్ఆర్ మునిసిపల్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు ,ప్రవేట్ విభాగం లో రత్నం హైస్కూల్ కోవూరు విద్యార్థులు అర్హత సాధించారు. నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభను కనపరిచిన వారికి సర్వశిక్షా అభియాన్ ఏపిసి వెంకట సుబ్బయ్య విజేతలకు మెమెంటో జ్ఞాపిక, ప్రశంసాపత్రం, పుస్తకాలు బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథి డాక్టర్ బి.రాజేశ్వరరావు పాల్గొని శాస్త్రీయత పైన అవగాహన కల్పించారు. జెవివి నేతలు యం.వి.చలపతి, ఏ.విజయ్ కుమార్,బుజ్జయ్య,డాక్టర్ శ్రీనునాయక్,కామయ్య, చలపతి శర్మ, కష్ణ, మాదాల రాము, కష్ణారావు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

మేయర్‌పై బ్రహ్మాస్త్రం..!

రాజకీయాలు రోజు రోజుకు మారిపోతున్నాయి...విలువులు, విశ్వసీయత, నీతి, నిజాయతీ, నిబద్ధత అంటూ మాట్లాడే నేతలు ఏ పూటకుఆ మాట మార్చుతున్నారు.. నాలుగేళ్ల కిందట ఉన్న నెల్లూరు కార్పొరేషన్ రాజకీయాలు నేడు పూర్తిగా భిన్నంగా తయారయ్యాయి. నెల్లూరు నగర మేయర్ పొట్లూరు సవ్రంతిపై నేడు అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వనున్నారు.. మేయర్ టిడిపి, వైసిపి ఏపార్టీకి కాకుండా ఒంటరిగా మిగిలిపోయారు.. రాజకీయ ఎత్తుగడుల్లో గిరిజన మహిళ తమ పదవి కోల్పోతు న్నారు... టిడిపి నాయకత్వం మేయర్ అంశంపై సీనియర్‌గా పావులు కదుపుతోంది. కేవలం ఏడాది కోసం ఓ గిరిజన మహిళ పట్ల ఇలా వ్యవహారించాలా అనే విమర్శలు వస్తున్నాయి... డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ను ఆ పదవిలో కూర్చోబెట్టడానికి కొందరు నాయకులు పక్కా వ్యూహాంతో ఈ వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది.

- ◆నేడు అవిశ్వాస నోటీసులు
- ◆ఒంటరిగా మిగిలిన 'స్రవంతి'
- ◆టిడిపి నేతల వ్యూహం
- ◆నూతన మేయర్ ఎవరు..?

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాజరీయాల్లో దళితులు.. గిరిజనులు.. ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నచం దంగా ఉన్నారు... పోట్లూరు స్రవంతి తీసుకున్న రాజకీయ నిర్ణయం ఆమె పదవికే ఎసరు పెట్టింది. 2021 నవంబర్ 24న నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా తొలి గిరిజన మహిళ అయిన పి స్రవంతి ఎన్నికైయ్యారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సన్నిహితులుగా ఉన్న జయవర్ధన్ సతీమణి స్రవంతికి మేయర్ పదవి దక్కింది. వైసిపి అధికారంలో ఉండగా కార్పొరేషన్‌లోని 54 డివిజన్లను ఆ పార్టీ గెలుచుకుంది. పోటీ ఉన్నప్పటికీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన నమ్మిన బంటుగా ఉన్న జయవర్ధన్ కుటుంబానికి అవకాశం కల్పించారు.. డిప్యూటీ మేయర్లుగా రూప్‌కుమార్‌యాదవ్, ఖలీల్ ఆహ్మద్ ఎన్నికయ్యారు. అప్పటి నుంచి మేయర్ స్రవంతి, భర్త జయవర్ధన్ శ్రీధర్‌రెడ్డితోనే నడిచారు. 2024 ఎన్నికలకు ముందు రాజకీయ పరిణామాల్లో భాగంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏడాదికి ముందే టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అప్పట్లో స్రవంతి ఆయనతోనే నడుస్తానని, తనకు రాజకీయ భిక్ష పెట్టారని చెప్పారు. వైసిపి నుంచి కొందరు కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి వెంట వచ్చారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరకువచ్చే సమయానికి మేయర్ శ్రీధర్‌రెడ్డిని కాదని, అప్పటి వైసిపి నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి మళ్లీ వైసిపిలో చేరారు. శ్రీధర్‌రెడ్డి పూర్తిగా దూర మైయ్యారు. 2024 ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతో కార్పొరేషన్‌లో సిటిలో ఏడుగురు, నెల్లూరు రూరల్‌లో నలుగురు మినహా అందరూ టిడిపిలో చేరారు. మేయర్ టిడిపి నేతలతోనూ, శ్రీధర్‌రెడ్డితోనూ మంచిగా ఉన్నప్పటికీ ఆయన ఎప్పుడు దగ్గరకు రాన్విలేదు.

నేడు అవిశ్వాస నోటీసులు...!

పోట్లూరు స్రవంతి మేయర్‌గా ఎన్నికై నేటికి సరిగ్గా నాలుగేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో మంత్రి పి. నారాయణ, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మేయర్ అవిశ్వాసం పై చర్చించారు.ఉదయం కోటంరెడ్డి కార్యాలయానికి వెళ్లిన నారాయణ ఆయనతో చర్చించారు. మధ్యాహ్నం కార్పొరేటర్లతో గొమతి నగర్‌లోని మంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అందరూ ఆమెపై ఆవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 39 మంది సంతకాలు చేశారు. నేడు కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి తీర్మానం ప్రవేశపెట్టాలనికోరనున్నారు. అందరి సంతకాలతో కూడిన లేఖ అందజేయనున్నారు. 15 రోజుల్లోపు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఏడాది కాలంలో ఆరు, , ఏడు నెలలు మాత్రమే అధికారం ఉంటుందని, తర్వాత ఎన్నికలు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అలాంటి సమ యంలో ఓ ఎస్‌టి మహిళ పట్ల ఇలా వ్యవహరించడం దేనిని కొందరు కార్పొరేటర్లు నర్మగర్భంగా వ్యాఖ్యని స్తున్నారు. ఇది పార్టీకి పెద్దగా ప్రయోజనం కలగిం చదని కొందరు అంటున్నారు. వేయర్‌ను తొలగిం చడం ద్వార వైసిపిని దెబ్బతీశామని టిడిపి భావిస్తోంది.

పి .స్రవంతి, మేయర్

అవిశ్వాసంపై వ్యూహరచన చేస్తున్న మంత్రి, ఎంఎల్ఎ

మేయర్ విషయంలో వైసిపి మోనం..!

స్రవంతి రెండింటికి చెడ్డ రేవడిలా తయారైయింది. ఇప్పుడు ఆమెను టిడిపి, వైసిపి నేతలు ఎవ్వరూ దగ్గరకు రానివ్వడం లేదు. ఆమె ఏపార్టీలో ఏలేకుండా ఒంటరిగా మిలిగిపోయారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కార్పొరేషన్‌లో ప్రస్తుతం వైసిపికి 12 మంది కార్పొరేటర్లు ఉన్నారు. నెల్లూరు సిటీలో ఏడు, రూరల్‌లో ఐదు మంది ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నారని తెలియడంతో ఆదివారం ఉదయం మేయర్ స్రవంతి, భర్త భయవర్ధన్ వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది. తనకు వైసిపి సపోర్టు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఇప్పుడు ఏపార్టీలో ఉన్నారు. ఎందుకు ఇలా జరిగిందనే విషయాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. పార్టీ అధిష్టానంతో మాట్లాడి చెబుతానని, ఎలాంటి హామీ ఇవ్వకుండా పంపినట్లు సమాచారం. స్రవంతి ఎన్నికల తర్వాత వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆమెను వారు తమ సభ్యురాలుగా గుర్తించడం లేదు. అందుకే అవిశ్వాస తీర్మానం విషయంలో తటస్థంగా ఉండాలని నిర్ణయం తీసు కున్నట్లు తెలుస్తోంది. వైసిపి బలపరిచినా స్రవంతిపై టిడిపి ప్రయోగించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయే పరిస్థితి లేదు.

రూప్‌కుమార్ యాదవ్ కోసమేనా..!

మేయర్ స్రవంతిని పదవి నుంచి తొలగించి అక్కడ డిప్యూటీ మేయర్‌ను కూర్చోబెట్టడానికి టిడిపిలోని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు మేయర్ ఎస్‌టి జనరల్ కేటగిరికి సంబంధించింది. ఇప్పుడు మేయర్‌ను తొలగిస్తే ఆ స్థానంలో ఎస్‌టి కార్పొరేటర్ దేవరకొండ సుజాతను ఎన్నుకుంటారనే ప్రచారం జరుగుతొంది. స్రవంతి దిగిపోయిన తర్వాత మేయర్ ఎన్నిక జరగకుండా ఏదో ఒక చెక్ పెడితే డిప్యూటీ మేయర్‌గా ఉన్న రూప్‌కుమార్ యాదవ్ ఆ స్థానంలో ఇన్‌ఛార్జిగా ఉండే అవకాశాలు ఉంటాయని తెలుస్తోంది. కేవలం మేయర్ పదవి ఒక్క ఏడాది మాత్రమే ఉంది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఏడు, ఏనిమిది నెలలే అందుకే తక్కువ కాలంలో రూప్‌కుమార్ ఉంటే నగరంలో కొంత ఉత్సాహం.. ఊపు తీసుకొస్తారని టిడిపిలోని కొందరు ముఖ్యనేతలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. రాజకీయాల్లో ఎప్పుడు ఏమైనా సాధ్యమై. ఏం జరుగుతుందో చూడాలి.

ప్రభుత్వ బ్యాంకును ఏర్పాటు చేయాలి

వెంకటేశ్వరపురం సెంటర్‌లో మహాధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 53 ,54 డివిజన్ల పరిధిలో ప్రభుత్వ బ్యాంకును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు వెంకటేశ్వరపురం సెంటర్ లో మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు స్థానిక మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ధర్నాకు 53వ డివిజన్ శాఖ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ మహాధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ పాల్గొన్నారు. ప్రజల డిమాండ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ 53 ,54 డివిజన్ల పరిధిలో కెనరా బ్యాంకును స్థానిక ప్రజలు కలిసి అభివద్ధి చేసుకున్నారనారు. సంస్కరణల పేరుతో బ్యాంకులను విలీనం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ క్రమంలో నవాబుపేట ప్రాంతంలోని బ్యాంకును వెంకటేశ్వంˆపురం ప్రాంతంలో ఉన్న కెనరా బ్యాంకులో కలిపివేసిందన్నారు. ఈ క్రమంలో స్థానికులకు, ఖాతాదారులకు తెలియకుండా గత నాలుగేళ్ల కిందట నవాబుపేటకు వెంకటేశ్వరపురంలో ఉన్న కెనరా బ్యాంక్‌ని తరలించారన్నారు. స్థానికంగా బ్యాంకు లేకపోవడంతో రోజువారి బ్యాంకు లావాదేవీల కోసం ప్రజలు, పొదుపు సంఘాల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 53 , 54 డివిజన్ల పరిధిలో లక్ష మందికి పైగా ప్రజలు నివాసముంటున్న బ్యాంకు లేకపోవడం విచారకరమన్నారు. తక్షణమే వెంకటేశ్వరపురంలో ప్రభుత్వ బ్యాంకును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఏర్పాటు చేసేంతవరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ, కాయంబు శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్ ,కత్తి పద్మ , బిపి నరసింహ,ఎం చిరంజీవి, అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి, శాఖ కార్యదర్శులు ఎస్ మంజుల, షేక్ జాఫర్,స్థానిక నాయకులు షకీలమ్మ, లక్ష్మి,విజయ భార్గవి, ఖాదరమ్మ, షాహిన్, రాజేశ్వరి నాగేశ్వరమ్మ, బయన్న, మధు,మనీ, రవి,సునీల్,నక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-నెల్లూరు : జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు 2025లో భాగంగా కోహెన్స్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృ జనాత్మకత, సంస్కృతి సమితి, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహణ సారథ్యంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కవులు, రచయితలు, కళాకారులు, సమాజ సేవకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. జిల్లాలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, తదితర సేవలందించిన ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాలును సత్కరించారు. జిల్లా నుండి వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జె. వసుంధర కూడా సత్కారం అందుకున్నారు.

రౌడీషీటర్లకు హెచ్చరిక

ప్రజాశక్తి-నెల్లూరు : ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన నేరస్థులకు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజా శాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదు. ఎవ్వరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు : పెన్నా పరివాహక ప్రాంత జిల్లా కోస్తా మండలాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని, సంబందించిన స్టేషన్ హౌస్ సూపర్ వైజింగ్ అధికారులకు ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల ఆదేశాలు జారీ చేశారు. రానున్న 4,5 రోజులల్లో మోస్తారు నుండి భారీ వర్ష సూచనల నేపథ్యంలో సోమశిల రిజర్వాయర్ నుండి నీరు కిందకు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో సోమశిల ఆనకట్ట నుండి ఈరోజు మధ్యాహ్నం 27,300 క్యూసెక్కుల వరకు నీరు దిగువకు విడుదల చేయనున్నారు. రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లోలను బట్టి ఇది పెరగవచ్చునని,ఈ నేపథ్యంలో దిగువన ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు చేయాలన్నారు. పెన్ననదిలోకి పశువుల కాపరులు ఎవరూ వెళ్ల కుండా సంబందించిన ఎస్‌హెచ్‌ఓలు హెచ్చరికలు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐ టియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. ఆదివారం నరుకూరు సిఐటియు ఆఫీసులో అఖిలభారత 18వ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. రాజా, సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్యలు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని, హమాలీ ఆటో ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, విద్య వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల ని, డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ 26న కలెక్టరేట్ వద్ద మహాధర్నా ఉంటుందని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు ఆంధ్ర ప్రదేశ్ విశాఖపట్నంలో జరగబోవు సిఐటియు అఖిలభారత 18వ మహాసభలో జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం వి రమణయ్యలు పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ మధుసూదనమ్మ, నరుకూరు సెంటర్ ఆటో యూని యన్ కార్యదర్శి గోపి, రాదయ్య, అజ్మా, ప్రభావతమ్మ చిన్నబ్బాయ, కందిపాటి రమణమ్మ, రఘు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు అన్నం పుట్టయ్య, మారుబోయిన వెంకట శేషయ్య ఎల్లి గోపి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను నేడు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు : సత్య సాయిబాబా సేవలు విశ్వవ్యాప్తం అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు ఆదివారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళుల ర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో విజయకుమార్, సమాచాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్, కలెక్టరేట్ ఎఒ తుమ్మా విజయకుమార్, సత్యసాయిసేవాసంస్థ సభ్యులు సురేష్‌సింగ్, శేషు, నాగలక్ష్మి, జీవన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నెల్లూరు : యుపిఎస్‌సి, సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే ఎస్‌సి,ఎస్‌టి నిరుద్యోగ యువతకు అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి కలిగిన, అర్హులైన వారు తమ పేర్లను ఈ నెల 26వ తేదిలోగా దరఖాస్తు చేసుకోని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఐఎఎస్ వి.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -సైదాపురం : స్థానిక మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ పాల్గొన్నారు. ఆమయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు సుమారు మూడు లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ బోర్డుని రద్దుచేసి భవనిర్మాణ కార్మికుల కడుపు కొట్టా రన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా భవననిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలో 12 మందితో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులుగ చిత్తలూరు శివయ్య, కార్యదదర్శిగ పెనమల వెంకటంˆమణయ్య, ని ఎన్నుకోవడం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు కుంచం రత్నగిరి, అడసనపల్లి విష్ణు, కార్మికులు,వెంకటేశ్వర్లు కుంచం శీనయ్య, వెంకటకష్ణ ఉన్నారు.

వేగంగా డివైడర్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని పామూరు రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో ఈ పనులు రాత్రి, పగలు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే ఓవి రోడ్డు పనులు చేపట్టనున్నారు.

రవీంద్రనాథ్ పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు: టిడిపి నాయకుడు పరిటాల మాధవరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకుడు దివి రవీంద్రనాథ్ ఆదివారం మాధవరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిడిపోతు వెంకట సురేష్ బాబు వారి బావ పరిటాల మాధవ రావుతో తనకు ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం చిడిపోతు సురేష్ బాబుతో పలు విషయాలు పై మాట్లాడారు.

మైనార్టీల సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రషీద్ -ఘనంగా రూరల్ మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల సమస్యలకు పరిష్కారం చూపించకుండా నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నాయని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ విమర్శించారు. ఆదివారం వేదాయపాళెం ప్రాంతంలోని మన్సూర్ భవన్‌లో ఆవాజ్ రూరల్ 5వ మహాసభ నిర్వహించారు. అధ్యక్షులుగా బుఖారి సాహెబ్ వ్యవహరించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనారిటీల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. విద్యకు, ఉపాధికి దూరమై రోజువారీ కూలీలుగా, మెకానికులుగా జీవనం సాగిస్తున్నారన్నారు. అనేకమందికి సొంత ఇల్లు లేక బాడుగేళ్లలో నివసిస్తూ ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అటువంటి వారినందరిని గుర్తించి వారికి సొంత ఇల్లు స్థలాలు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ముస్లింల పెళ్లిళ్లకు షాదీ ముబారక్ తోఫా పథకం ఇస్తామని అన్నారని దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా పాలకుల అధికారులు స్పందించి రూరల్ పరిధిలో ముస్లింల కోసం షాదిమంజిల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్కచెరువుపాడు వద్ద నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలను వసతులు కల్పించి అభివద్ధి చేయాలని కోరారు. అలాగే ముస్లిం బాలికల కోసం గురుకుల పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ నజీర్, బుఖారి సాహెబ్

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం మహాసభ 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నది. అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ నజీర్, బుఖారి సాహెబ్, సహాయ కార్యదర్శిగా సయ్యద్ చాంద్ భాషా ఉపాధ్యక్షులుగా షేక్ బషీర్ కోశాధికారిగా షేక్ రసూల్ బాయి లను ఏకగ్రీవంగా ఎన్నికచేసింది.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - ఉలవపాడు

ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో కె వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆదివారం కూనం వెంకట సుబ్బారెడ్డి 14 వ వర్ధంతి, వారి కుమారుడు అనిల్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కూనం సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం 14 ఏళ్ల నుంచి ప్రతి ఏటా వైద్య శిబిరంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రజలంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రజల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూనం అనిల్ రెడ్డి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలు మున్ముందు కూడా చేపట్టాలని ఆకాంక్షించారు. గ్రామంలో అభివద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు.కందుకూరు నియోజకవర్గ అభివద్ధికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. రామకష్ణాపురం గ్రామం వద్ద పొలాల్లోకి వెళ్లే చప్టా దెబ్బతినడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని, ఆ విషయాన్ని ఎంపీ దష్టికి తీసుకు వెళ్ళగానే కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.ఇంకా చాలా అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్ఎ నాగేశ్వర రావులను నిర్వాహకులు సన్మానించారు. వెంకటరమణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు ప్రముఖ వైద్యులు డాక్టర్ కె సీతారామయ్య డాక్టర్ కె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 15 మంది ప్రత్యేక వైద్యులు సేవలందించారు. వరంగల్ మాజీ శాసనసభ్యులు శ్రీధర్ బాబు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, సూర్య ప్రకాష్ రెడ్డి పార్టీ నాయకులు అంకమ్మరాజు, ఆదినారాయణ కూనం తాతిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపి వేమిరెడ్డి, ఎంఎల్ఎ ఇంటూరి

గదుల నిర్మాణ పనులు ఆగలేదు..

ప్రజాశక్తి-కందుకూరు : ఎవరెన్ని రచ్చ చేసినా పట్టణంలోని అంకమ్మ తల్లి దేవాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణం అగలేదు. శనివారం మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం శ్రీ అంకమ్మ తల్లి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణం చేయడానికి లేదంటూ అడ్డుకున్న విషయం తెలిసిందే. శివరాం శనివారం రాత్రి దేవాలయం నుంచి బయటకు వెళ్ళగానే ఆగ మేఘాల మీద షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి పునాదులు వేశారు. రాత్రికి రాత్రే గదుల నిర్మాణానికి అవసరమైన పునాదులకు సిమెంటు బెల్ట్ వేశారు. తెల్లారి ఆ ప్రాంతానికి వచ్చి చూసిన ప్రజలు ఆశ్చర్యపోయారు. అంకమ్మ తల్లి ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో కొనసాగుతుంది.ఆ శాఖ నిబంధనల ప్రకారం ఆలయ అభివద్ధి కోసం నిధులను సమీకరించుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత హైకోర్టు ను ఆశ్రయించి గదుల నిర్మాణాన్ని ఆపమని కొందరు కోరారు.కొద్ది నెలలపాటు గదుల నిర్మాణం ఆగినప్పటికీ ఆ తర్వాత మొదటి దశ గదులు నిర్మాణం పూర్తయి ప్రారంభం కూడా అయ్యాయి. రెండో దశ గదుల నిర్మాణం చేసే సందర్భంలో శివరాం అవి చేయడానికి లేదంటూ అడ్డుపడ్డారు. అయినా నిర్మాణ పనులు ఆగలేదు.

శరవేగంగా జరుగుతున్న గదుల నిర్మాణం

సమీక్షిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్

కోటి సంతకాల సేకరణపై సమీక్ష

ప్రజాశక్తి-కందుకూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరు పట్టణ, మండలాల నాయకులు, కార్యకర్తలుతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను సమీక్షించి మండల ,పట్టణ నాయకులకు పలు సూచనలు చేశారు.ఈ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కూటమి ప్రభుత్వం దారాదత్తం చేయటాన్ని నిరసిస్తూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గం లక్ష్యాన్ని చేరుకుంటుందన్నారు. వైసిపి రాష్ట్ర ఇంటెలెక్చువల్ కార్యదర్శిగా ఎన్నికైన కాకర్ల రాజగోపాల్ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త ఆవేదన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : టిడిపి ఆవిర్భావం నుంచి టిడిపిలో ముఖ్యంగా ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వీరాభిమానిగా ఉన్నప్పటికీ తనకు పార్టీలో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఓ అభిమాని తీవ్ర ఆదేవన వ్యక్తం చేశారు. కోడూరు మేజర్ పంచాయతీకి చెందిన దళిత టిడిపి కార్యకర్త సుబ్రహ్మణ్యం ఇటీవల టిడిపిలో తనకు అన్యాయం జరిగిందంటూ" ఆవేదన చెందారు. పార్టీని నమ్ము కున్న తనను చంద్ర మోహన్ రెడ్డి ఎంతో ఆదరించారన్నారు. అయితే ఇటీవల ఓ టిడిపి నాయకుడు వ్యవహారి స్తున్న ఒంటెద్దు పోకడ బాధిస్తుందన్నారు. కోడూరు టిడిపిలో అసంతప్తి జ్వాలా లు ఎగసి పడుతున్నాయన్నారు.

మండపం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-నెల్లూరు : సంతపేట ప్రాంతంలోని శ్రీ వెంకటమ్మ పేరంటాలు ఆలయ రాజగోపురం మహా మండపం నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.1.15 కోట్లతో మూడంతస్తుల రాజగోపురం మహా మండపం నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి భూమిచేశారు. వెంకటమ్మ పేరంటాలు దేవస్థానంలో మహిళలు ప్రత్యేకంగా నిర్వహించిన కుంకుమార్చన పూజా కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వతేదీన ఉదయం 10:00 గంఎల నుంచి మధ్యాహ్నం 12:00 గంఎల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661 నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-కొడవలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయాలనే ప్రయత్నాన్ని ప్రజలు గట్టిగా ప్రతిఘటించాలని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి రావు అన్నారు. మండలంలోని వెంకన్నపురం గ్రామంలో నిర్వహించిన వైసిపి ప్రజా ఉద్యమం కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు అందుబాటు వైద్య విద్యను దూరం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ పేరుతో చేస్తున్న మోసపు వైఖరిని ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసే భవిష్యత్ తరాలకు నష్టం తప్పదని ఆయన హెచ్చరించారు. వైసిపి అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పి.ఎ.సి. సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సూచనల మేరకు కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి ప్రయివేటీకరణ విధానానికి వ్యతిరేకంగా తమ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, మండల అధ్యక్షుడు చిమట శేషగిరి, ఎంపిపి గాలి జ్యోతి, నాయకులు ఉడయ భాస్కర్, పెంచలయ్య, మండల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

దశాబ్దాలుగా శిథిలావస్థలో ప్రభుత్వాస్పత్రి

ప్రజాశక్తి-కోవూరు : పోతిరెడ్డిపాలెం గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న చికిత్సలకే ఇనమడుగు, కోవూరు వెళ్లాల్సి రావడం వల్ల సమస్యలు మరింతగా పెరుగుతున్నాయని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, గ్రామ ప్రజల తరఫున విషయాన్ని డిఎంహెచ్ఒ సుజాత దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి పునర్నిర్మాణం జరిగితే గ్రామానికి ఎంతో పెద్ద మేలు జరుగుతుందని వివరించారు. ఈ అంశంపై డిఎంహెచ్ఒ సుజాత సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలిస్తామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

పక్కా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి..

ప్రజాశక్తి-జలదంకి : పక్కా గృహాలు లేని నిరుపేదలు కాలనీల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ వేల్పుల వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉదయగిరి ఎంఎల్ఏ కాకర్ల సురేష్ పర్యవేక్షణలో నూతన గృహాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలో ఇళ్లు లేని పేదలు మీ పరిధిలోని సచివాలయాల్లో 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గృహ నిర్మాణం కోసం రూ.2.50లక్షలను మంజూరు చేస్తుందన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిరిజన కాలనీలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్టి కాలనీలో సుమారు 120 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ గిరిజనులు తాగునీటి కోసం అవస్థలు పడుతుండటంతో శ్రీ సాంబశివాయ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి గిరిజనుల తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని వారి తాగునీటి అవసరాల నిమిత్తం తాగునీటి బోరును ఆయన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి టెంకాయ కొట్టి బోర్‌ను వేయించారు. అలాగే చేతి పంపును కూడా అన్ని హంగులతో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర రెడ్డి స్వయంగా ఆ గిరిజన కాలనీకి విచ్చేసి వారి కళ్లల్లో వారి హృదయంలో కలిగిన సంతోషాన్ని పంచుకొని మంచినీటి బోరు పరిశీలించి చేతిపంపు బోర్‌ను ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ముఖ్యంగా తమకు చేస్తున్న సాయం జీవితాల్లో స్థిరంగా నిలిచిపోతుందని, ఎంతో కాలంగా తాగునీటి అవసరాల నిమిత్తం వేయించిన ఈ బోర్ తమకు ఎంతగా ఉపయోగపడుతుందని తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-కావలి : కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులలో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) ప్రవేశ పెట్టిన సందర్భంగా డిసెంబర్ 7వతేదీన జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు జరుగబోవు ఎన్ఎంఎంఎస్ పరీక్షలు నేపథ్యంలో రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంబిఎన్. ప్రసాద్ రావు, ఆధ్వర్యంలో వారి సతీమణి రత్నమ్మ పేరు మీద స్థాయిలో కావలిలో నిర్వహించిన నమూనా పరీక్షలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ముఖ్య అతిథి కావలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి.శ్రీధర్ చేతులమీదుగా మొదటి ప్రైజ్ జోత్స్న, రెండవ ప్రైజ్ ఎ.నాగచైతన్య, మూడవ ప్రైజ్ కె.ఆదిత్య శేఖర్ నాల్గవ ప్రైజ్ షేక్.సమీర్, స్పెషల్ ప్రైజ్ 6మందికి అందించారు. ప్రసాద్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తమ ప్రతిభను సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుండి సీనియర్ ఇంటర్ వరకు 4సంవత్సరాలు నెలకు రూ.12000 చొప్పున రూ.48వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందని, ఇది సువర్ణ అవకాశమని, 8వ తరగతి విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. డిఎస్‌పి శ్రీధర్ ప్రశంసిస్తూ, ప్రసాద్ రావు విద్యార్థులలో సృజనాత్మక శక్తి, జిజ్ఞాస, మేధాశక్తిని పెంపొందించడానికి, పేద విద్యార్థులకు ఉపయోగ పడే మంచి కార్యక్రమాలు చేస్తూ వారికి వచ్చే పెన్షన్‌లో కొంత ఉపయోగించి, ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం సంతోషకర విషయమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్.బాషా, విశ్రాంత రమణయ్య, మీకోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్‌కుమార్, హ్యాపీ సేవాసంస్థ సయ్యద్ ఫయాజ్, లోకేశ్ వర్మ ఎం.మాలకొండారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.అజీత్‌ఖాన్, బాల్చి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

'గండికోట'కు సత్యసాయి సాహిత్య సేవా పురస్కారం



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : తెలుగు భాష, చరిత్ర, సంస్కృతి, జానపదం, పండుగలను భావితరాలకు అందిస్తున్న బుచ్చిరెడ్డిపాలెం రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ శ్రీ సత్యసాయి సాహిత్య సేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గజల్ శ్రీనివాస్ గండికోటకు అందజేసి అభినందించారు. విద్యార్థులకు తెలుగు భాషలో అనేక రకాల పోటీలు నిర్వహించి సాహిత్యం వైపు దృష్టి మళ్లిస్తున్నారని ఆయన కొనియాడారు. సాహిత్య సేవా పురస్కారం అందుకున్న గండికోటను ఎంఇఒలు ఎం.దిలీప్ కుమార్, పి.వి.రత్నం, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు అభినందించారు.

కావలి ఐఎంఎకు అవార్డులు

ప్రజాశక్తి-కావలి : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సాంవత్సరిక కాన్ఫరెన్స్‌లో కావలి ఐఎంఎ శాఖకు రెండు ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన ఐఎంఎ రాష్ట్ర సాంవత్సరిక వేడుకల్లో ఈ అవార్డులను కావలి ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ గోపీకృష్ణ, కోశాధికారి డాక్టర్ పి.శివప్రసాద్ జాతీయ ఐఎంఎ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు, సెక్రటరీల చేతుల మీదుగా అందుకున్నారు. మొదటి అవార్డు "బెస్ట్ సోషల్ యాక్టివిటీ" కింద ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సుబ్బారావు అందుకోగా, ఉత్తమ కార్యదర్శి అవార్డును కావలి ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ గోపీకృష్ణ అందుకున్నారు. కావలి ఐఎంఎ ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన గర్భకోశ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లకు ఉచితంగా ప్రజలకు పరీక్షలు జరిపే క్యాంపులు నిర్వహించారు. ఇవికాక మరెన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ అవార్డులు కావలి ఐఎంఎకు లభించాయి. ఈ సందర్భంగా కావలి ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ కావలి ఐఎంఎ సభ్యులు, ఇతర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజిక సేవకుల సహకారంతోనే తాము ఈ ఘన విజయాన్ని సాధించగలిగినట్టు, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

'కుష్టు' రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్ వల్లి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

గతంలో లెప్రసీ (కుష్టు) వ్యాధి అంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనవుతుండేవారు. ఈ వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను ఆసుపత్రులల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి ఇంటిని వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి ప్రజలకు కుష్టు వ్యాధిపై అపోహలను తొలగించి, వ్యాధి నివారణపై అవగాహన కల్పించింది. ఈ క్రమంలో అనుమానం ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్ వల్లి మాటల్లో ...

ప్రశ్న. స్పర్శ కార్యక్రమ నిర్వహణ ముఖ్య ఉద్దేశం ఏమిటీ.. ఈ కార్యక్రమంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..?

జవాబు. ప్రతి సంవత్సరం మహాత్మ గాంధీ వర్థంతి రోజును పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలు (స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాలు) నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమం ముఖ్య ఆలోచన కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించి భవిష్యత్తు తరాలకు లెప్రసీ రహిత సమాజాన్ని అందజేయాలన్నది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ల లల్లో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాలకు వెళ్ళి లెప్రసీ వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం, అనుమానితులు ఎవరైనా ఉంటే గుర్తించి పరీక్షలు చేసి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడుకోవాల్సిన మందులు అందజేస్తున్నాం.

ప్రశ్న. లెప్రసీ వ్యాధి లక్షణాలు ఏమిటీ.. ఎలా వ్యాపిస్తుంది.. చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయా..?

జవాబు. శరీరంపై పోలిపోయిన, రాగి రంగులో మచ్చలు ఏర్పడినా.. ఆ మచ్చలపై స్పర్శ లేక నొప్పి లేకపోయినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో ముఖ్యంగా పాదాలు, చేతులు, వేళ్ళు తిమ్మెరలు పెడుతునా, చర్మం దళసరిగా మారిపోతున్నా. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించి వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. లెప్రసీ వ్యాధి వల్ల శరీరం అంతా పుండ్లతో నిండిపోతుంది. ఇది చర్మానికి, నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధి. మ్యూకస్ పొరను ప్రభావితం చేస్తుంది. క్షయ కారకమైన మైక్రో బ్యాక్టీరియాకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పేరు మైక్రో బ్యాక్టీరియం లెప్రేగా పిలుస్తారు. ముఖ్యంగా ఛాతీ, పొట్టపైన పొక్కులు లేవడం కనిపిస్తుంది. కుష్టు వ్యాధి ఇతర అంటువ్యాధుల వలే ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. 1873 సంవత్సరం హాన్సన్ అను నార్వే శాస్త్ర వేత్త ఈ వ్యాధికి కారణమైన జీవిని సూక్ష్మదర్శనిలో గుర్తించాడు. ఈ వ్యాధి వ్యాధిగ్రస్తుని నుండి గాలి ద్వారా, సన్నిహిత సంబంధాల ద్వారా ఇతరులకు సులువుగా వ్యాప్తి చెందుతుంది.

ప్రశ్న. ఈ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి, ఎన్ని రోజుల్లో లెప్రసీ వ్యాధి నయం అవుతుంది..?

జవాబు. ఎవరైనా కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించినా.. అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోని కుష్టు వ్యాధి నిర్మూలన కేంద్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలల నుంచి 12 నెలల వరకు మందులు మింగాల్సి ఉంటుంది. ఈ వ్యాధికి గురైన వారు సమాచారాన్ని దాచడం వల్ల పక్కవారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లో వైద్యుడి వద్దకు వెళ్ళి పరీక్షలు చేసుకోవాలి. ఈ వ్యాధి నివారణకు బహుళ ఔషధ (మల్టీ డ్రగ్) చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ చికిత్స ఎంతో నమ్మకమైనది. ఈ వ్యాధి ఏదశలో ఉన్నప్పటికీ ఈ మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అంగవైకల్యాన్ని జయించవచ్చు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీ (పీబీ)గా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు మచ్చలు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీ (ఎంబీ)గా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 15 నెలల్లో కోర్సును పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. దాదాపు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ఖర్చయ్యే మందులను పూర్తిగా ఉచితంగా వ్యాధి గ్రస్తులకు అందిస్తారు. 6 నెలలు నుంచి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆలయాల అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులోని శ్రీ అభయాం స్వామివారి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని మినీ బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ వంశపారంపర్య కుటుంబ సభ్యునిగా కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారానికి మంత్రి ఆనం హాజరయ్యారు. ముందుగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ వంశపారంపర్య అధ్యక్షుడిగా రవీంద్ర రెడ్డికి ఆలయ అభివృద్ధి బాధితులు అప్పగించారు. చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి ఒక్కరిపై అభయాంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. త్వరలోనే ఆలయ పాలకమండలి సభ్యులను నియమించాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏ ఆలయం పునర్నిర్మాణం జరగాలన్న నూతన ఆలయ నిర్మాణం జరగాలన్న వాళ్ల మనసులోని ఆలోచనతో ఆలయాల నిర్మాణం జరుగుతుంది. కాబట్టి మన జిల్లాలో అనేక ఆలయాలకు శ్రీకారం చుట్టాం సోమేశ్వరాలయం అక్కడ ఉన్న పార్వతి విగ్రహం పోయిన వరదల్లో కొట్టుకపోవడంతో ఇవాళ రూ.13కోట్లతో సోమేశ్వర ఆలయంతోపాటి మరొక రూ.7కోట్లతో అమ్మవారి ఆలయానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులతో ముందుకు వచ్చిందన్నారు. ప్రతి గుడిలోనూ భగవంతుని ఆరాధన, ధూప దీప నైవేద్యం కోసం రూ.10వేలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కావలి

ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1,000 కిలోమీటర్ల సముద్రతీరం ఉన్నదని, 55లక్షల మంది మత్స్యకారులు జీవిస్తున్నారని తెలిపారు. మత్స్యసంపద ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని సపాదించి పెడుతున్న మత్స్యకారులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని కోరారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఆదివారం కావలి పట్టణం, పరిసర ప్రాంతాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వ్యాపార ప్రారంభోత్సవాలు, వివాహ వేడుకలు, పుట్టినరోజు వేడుక వంటి అనేక కార్యక్రమాలకు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. కావలి పట్టణంలోని రూపాయిమిద్దె సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "ఉదయ్స్ కాఫీ బార్"ను ఎంఎల్ఎ కావ్య కష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 20వ వార్డు టిడిపి నాయకులు ఎర్రంశెట్టి గోపి కుమారుడు ఉదయ్‌కుమార్‌ను అభినందించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన కాఫీ సేవలను అందించాలని సూచించారు. ప్రారంభోత్సవం అనంతరం పార్టీ నాయకులతో కాసేపు టీ తాగుతూ సత్సంగం సాగించారు. కావలి గురురాఘవేంద్ర కాలనీ మసీదు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "ఎండిఆర్ చికెన్ సెంటర్"ను కూడా ఎంఎల్ఎ ప్రారంభించారు. షాపు యజమాని మల్లికార్జునకు అభినందనలు తెలియజేసారు. అల్లూరు మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన యనమల శ్రీహరి యాదవ్ (మాజీ సర్పంచ్), సునీత కుమారుడు కిషన్ వివాహం నెల్లూరులోని శ్రీ కస్తూరి దేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి నూతన వధూ వరులను ఆశీర్వదించి, వారి దాంపత్యం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. దేశిరెడ్డి భాస్కర్ రెడ్డి – విజేత కుమారుడు నిఖిల్ రెడ్డి వివాహం శనివారం విపిఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. ఆముదాలదిన్నె టిడిపి సీనియర్ నేత ఉప్పాల శ్రీనివాసులు గౌడ్ – గీత గార్ల కుమారుడు విష్ణు చైతన్య వివాహం శనివారం ఆర్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కావలి రూరల్ ఎస్ఐ చిత్తతూరి తిరుమలరెడ్డి – సుజాత కుమార్తె లలిత వివాహం ఎస్ఎంకె కన్వెన్షన్ హాల్లో వైభవంగా జరిగింది. ఎంఎల్ఎ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కావలి రూరల్ చెంచుగానిపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత పోసిన శ్రీనివాసులు – ధనలక్ష్మి మనవరాలు స్వేచ్ఛ శ్రీ పుట్టినరోజు వేడుకలు శనివారం రాత్రి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు విచ్చేసిన ఎంఎల్ఎ చిన్నారిని ఆశీర్వదించి, ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు అభివృద్ధిని కోరుకున్నారు. ఏలూరు వెంకట కృష్ణయ్య – హజరత్ అమ్మ కుమారుడు రఘువరన్ వివాహం ఆదివారం కావలి నారాయణ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ వేడుకకు విచ్చేసిన ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిహెచ్‌సి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కోవూరు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పేదల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టబోతున్న యూనివర్సల్ హెల్త్‌పాలసీ ఎంతో మైలురాయిగా నిలుస్తుందని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శిథిలావస్థకు చేరిన పి.హెచ్.సి. భవనం విషయాన్ని స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని ఎంఎల్ఎ తెలిపారు. ఎంఎల్ఎగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో వైద్య సౌకర్యాల పరిశీలనలో భాగంగా ఇనమడుగు పి.హెచ్.సి.ని సందర్శించామని తెలిపారు. పి.హెచ్.సి భవన నిర్మాణానికి సంబంధించి విషయం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి తెలియజేయగా, ఆయన ప్రత్యేక చొరవతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1 కోటి 98 లక్షలు మంజూరు చేయించారని ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్యులు అందుబాటులో వుండేలా జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడం కూటమి ప్రభుత్వ ధ్యేయమని, గత 18 నెలల్లో కోవూరు నియోజకవర్గంలో అనారోగ్య పీడితులకు రూ.6కోట్లు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కోవూరు కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం తాను చేస్తున్న కృషిని ఎంఎల్ఎ ప్రజలకు వివరించారు. విద్య, వైద్యరంగాల్లో కోవూరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడం తన సంకల్పమని పేర్కొన్నారు. అతి త్వరలో ప్రారంభించనున్న యూనివర్శల్ హెల్త్ పాలసీ ద్వారా పేదలకు సంవత్సరానికి రూ.25 లక్షల విలువైన ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రైతుల సంక్షేమానికై ఇప్పటికే రెండు విడతలుగా యూరియా పంపిణీ జరిపినట్లు, 20యేళ్లుగా శుభ్రం చేయని సాగునీటి కాలువల్లో సిల్ట్ క్లియరెన్స్ చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే ఉగాదికల్లా పేదల గృహ పట్టాలు, పక్కాఇళ్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, స్థానిక వైద్యాధికారి నిరంజన్, ఎంపిడిఒ శ్రీహరి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఎంపిటీసీలు కొల్లారెడ్డి సునీల్, యదలపూడి నాగరాజు రెడ్డి, వైస్ సర్పంచ్ చేజర్ల మహేష్, సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాతమ్మ

అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అనంతసాగరం ప్రాజెక్ట్ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా వచ్చిన సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాతమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న వేతనాల పెంపు గురించి మాట్లాడటం లేదన్నారు. ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని 3నుండి 6సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండే విధంగా ప్రభుత్వం జిఒ ఇవ్వాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫారం, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని, పిల్లలకు ఇచ్చే మెనూ క్వాంటిటీని పెంచాలన్నారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు అదనపు పని భారం రద్దు చేసి ఆన్లైన్ వర్క్ తగ్గించాలని, ఆన్లైన్ వర్క్ కోసం కొత్త 5జి ఫోన్లు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం తొలిగించి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. అనంతరం 15మందితో నూతన ప్రాజెక్టు కమిటీని ఎన్నుకొన్నారు. ప్రాజెక్ట్ కమిటి అధ్యక్షులుగా వసుంధర, ప్రాజెక్ట్ కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా లక్ష్మీ, ఉపాధ్యక్షురాలుగా నాగమణి సహాయ కార్యదర్శిగా ఆదిలక్ష్మి, ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షులుగా బత్తల రత్తయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా, సిఐటియు అనంతసాగరం మండల అధ్యక్షులు మీరా మొహిద్దిన్, వెలుగు విఒఎల నాయకురాలు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం అనంతసాగరం మండల కార్యదర్శి వెంకటేష్, అనంతసాగరం, మర్రిపాడు మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న సిఐటియు నాయకులు

మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ముత్తుకూరు

డిసెంబర్ 31వ తేదీ నుండి వచ్చే సంవత్సరం జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ముత్తుకూరు మండల కమిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ సంఘం అధ్యక్షులు దుంపల ఏడుకొండలు, కార్యదర్శి నక్కా శాంప్రసాద్ సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి మహాసభలకు రావాలని ఆహ్వానిస్తూ జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ముత్తుకూరు మండల కమిటీ చేసిన ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో సర్వే

ప్రజాశక్తి-కావలి

జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ఎన్.ఎస్.ఎస్. యూనిట్ల ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో భాగంగా 5వ రోజు ఆదివారంకావలి శివారులోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద గిరిజన కాలనీలో, కావలి చెరువు దగ్గరలోని ఎస్టి కాలనీలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రశ్నావళి ద్వారా సామాజిక ఆర్థికపరమైన సర్వేని నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇలాంటి సామాజిక, ఆర్థిక పరమైన సర్వేలు నిర్వహించడం వల్ల అక్కడ నివసించే వారి జీవన విధానము, జీవన ప్రమాణస్థాయి, వారికి అవసరమైన సదుపాయాలు మొదలైనవి మనకు తేటతెల్లంగా తెలుస్తాయనీ, తద్వారా సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చి, వారి సమస్యలకు తగిన పరిష్కారాన్ని చూపించ వచ్చని తెలియజేస్తూ, వాలంటీర్లు సర్వే నిర్వహించ డానికి ఒక చక్కటి ప్రేరణను, ఉత్సాహాన్ని కలిగించారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లు పి.నాగేశ్వర రావు, ఎస్.కె. అయూబ్ అహ్మద్ నిర్వహణలో జరిగింది. కార్యక్రమంలో జవహర్ భారతి కామర్స్ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. సుబ్బరాయుడు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి ప్రసాద్ రెడ్డి, జాతీయ సేవా పథకం వాలంటీర్లు చేపట్టిన సోషియో ఎకనామిక్ సర్వేను చక్కగా నిర్వహించారు.

గంగమ్మ తల్లికి 'మన్నేటి' పూజలు

ప్రజాశక్తి-ఉదయగిరి

కొండాయపాలెం పంచాయతీ వెంకట్రావుపల్లి గ్రామంలో గంగమ్మ గుడి 41వ రోజు పూజ కార్యక్రమంలో అమ్మవారికి జరుగుతున్న ప్రత్యేక పూజలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి పాల్గొన్నారు. అందులో భాగంగా గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డికి గ్రామస్తులు యువత కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకమని ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లవేళలా తమ వంతు సహాయం ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు మన ఫౌండేషన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అళహరి సుధాకర్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గం, కొత్త బంగారుపాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గా భవాని కలశం, జ్యోతులతో ఊరేగింపు, పడి పూజ, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలకు స్వాములు జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్‌ను ఆయన నివాసంలో ఆదివారం ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. తప్పకుండా వస్తానని ఆయన తెలియజేశారు.

మా భూములు మాకివ్వాలి..

- గ్రామాలనే నమ్ముకున్నాం
- ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో ప్రభుత్వ భూమి కనపడితే చదును చేస్తూ ఆక్రమిస్తూ రెచ్చిపోతున్నారు. భూఆక్రమార్కుల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. జిల్లా అధికారులు ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని అడ్డుకట్ట వేయాలని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాతల కాలం నుండి గ్రామాన్ని నమ్ముకొని ఉన్నామని అర్హత గల ప్రతిఒక్కరికీ మా గ్రామంలోని ప్రభుత్వ భూమిని మాకే ఇవ్వాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్లపడే పంచాయతీ పప్పులవారిపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 60, 70 కుటుంబాలు తాతల తరం నుంచి ఇదే గ్రామంలో జీవనం సాగిస్తున్నామని, ఇంతవరకు తమకు భూములు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులను గుర్తించి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూములలో అక్రమార్కుల ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా గ్రామ ప్రజలను అమాయక రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాలు కనీసం పది సెంట్లు వ్యవసాయ భూమికి నోచుకోక అనేక అర్జీలను పట్టుకొని అధికారుల, నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని అయితే భూ బకాసురులు మాత్రం భూ దందా చేస్తూ రెచ్చిపోతున్నారు.

ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు..

మండల పరిధిలోని ఆర్లపడడియ పంచాయతీ పప్పులవారి పల్లి గ్రామంలో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నంలో సర్వే నెంబర్ 47,49,53 సుమారు 40 ఎకరాలు ఆక్రమిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు వారితో అడ్డుకొని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వభూమిని ఎకరాలు ఎకరాలు ఆక్రమిస్తే తమలాంటి భూములు లేని పేదవాళ్ళ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ, జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి తమ లాంటి పేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

రైతుల సమస్యలపై 26న ర్యాలీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

రైతుల సమస్యలు పరిష్కారానికై 26వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నట్లు, ఎపి రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షానవాజ్, రమణయ్య మాట్లాడారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. 2021వ సంవత్సరంలో రైతాంగ సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఐదు సంవత్సరాలు గడిచిన నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలకు చట్టం చేయాలన్నారు. రైతుల, వ్యవసాయ కార్మికుల రుణం విముక్తి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం కాకుండా ఆపాలని కోరారు. రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, తదితర డిమాండ్ల సాధనకు నిరసన ర్యాలీ చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు షాజహాన్, మున్వార్, తదితరులు పాల్గొన్నారు.